క్లుప్తంగా

కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ భవానీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. భవానీకాలనీ ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఈ కోత ఉంటుందని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ ఉండదని సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హాథిరాం తెలిపారు. బుద్వేల్, వర్మ కాలనీ, గ్రీన్‌సిటీ, బన్సీలాల్‌నగర్, భగవతిగూడ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

రేపు ఓటరు నమోదు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఉదయం 10గంటల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. కొత్త ఓటరు నమోదుతో పాటు సవరణలు, బదిలీలు చేసుకోవచ్చని, పాస్‌పోర్ట్ ఫొటో, చిరునామా ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, ఇదివరకే ఓటరుగా నమోదు అయి ఉంటే ఓటరు కార్డు, సవరణ చేయటానికి అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని రావాలని ఆయన సూచించారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



రాజేంద్రనగర్: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని ఆప్కో కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ప్యాచ్‌వర్క్ పనులు, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, వీధిదీపాలు తదితర సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత పాటిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. బస్తీ దవాఖానలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, జలమండలి అధికారులు వినయ్, బుచ్చిరెడ్డి, తిరుపతమ్మ, శాంతమ్మ, సురేష్, రవి, సోనీ, నరేష్ ,బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పంటల నమోదు

శంషాబాద్ రూరల్: రైతులు సాగు చేస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని మల్కారంలో పంటల నమోదు ప్రక్రియను గురువారం ఆమె పర్యవేక్షించారు. ఇక్కడ ఎంపిక చేసిన సర్వే నంబర్లలో సాగు చేస్తున్న మొక్కజొన్న, పత్తి, జొన్న, కూరగాయల సాగును పరిశీలించారు. వీటి నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పంటలకు ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పంటలకు తగిన మోతాదులోనే ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కవిత, ఏఈఓలు విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రీన్‌సిటీ అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ గ్రీన్‌సిటీలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. గురువారం గ్రీన్‌సిటీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ మేరకు కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రగడంపల్లి శ్రావణ్, నరేష్‌యాదవ్, ఆనంద్‌గౌడ్, నరేందర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కేబుల్.. సూసైడ్ స్పాట్

- కేబుల్‌బ్రిడ్జి దుర్గం చెరువులో దూకి 9 మంది ఆత్మహత్యాయత్నం
- ముగ్గురిని కాపాడిన లేక్ పోలీసులు
- కేబుల్‌బ్రిడ్జిపై ఎత్తైన కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

మాదాపూర్: కేబుల్‌బ్రిడ్జి సూసైడ్ స్పాట్‌గా మారింది. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారు కేబుల్‌బ్రిడ్జి వద్దకు వచ్చి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఎత్తు తక్కువగా ఉండడంతో ఇక్కడకు వచ్చి చెరువు మధ్యలోకి దూకుతున్నారు. అక్కడ ఎక్కువ లోతుగా ఉండడంతో దూకిన వారు బురదలో చిక్కుకుంటున్నారు. ఇటీవల తొమ్మిదిమంది ఆత్మహత్యాయత్నం చేయగా లేక్ పోలీసులు ముగ్గురిని కాపాడారు. మాదాపూర్‌లో దుర్గం చెరువు ఏరియా చుట్టుపక్కల ప్రాంతాల వారికి దూరాన్ని తగ్గించేందుకు కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన ఈ తీగల వంతెనను నిత్యం సందర్శకులు సందర్శిస్తుంటారు. అయితే ఈ కేబుల్ బ్రిడ్జి సూసైడ్ స్పాట్‌గా మారింది.



దుర్గం చెరువు లేక్ పోలీస్‌స్టేషన్

- కేబుల్ బ్రిడ్జిపై కేవలం 4 అడుగుల ఎత్తు ఉండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- లేక్ పోలీసులు అప్రమత్తంగా ఉన్నప్పటికి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- ఆకస్మాత్తుగా చెరువు మధ్యభాగంలో దూకడంతో ఊబిలోకి చొచ్చుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు.
- చెరువు మధ్యభాగంలో దాదాపు 40 అడుగుల లోతు ఉండడంతో బయటకు తీయాలంటే ఎక్కువ సమయం పడుతోంది.
- ఇప్పటికి 9 మంది సూసైడ్ చేసుకున్నారని అందులో ముగ్గురిని రక్షించినట్టు తెలిపారు.
- కేబుల్‌బ్రిడ్జిపై 12 నుండి 14 అడుగుల ఎత్తు ఉండే విధంగా రక్షణ కంచె ఏర్పాటు చేయాలని దుర్గం చెరువు లేక్‌పోలీసులు తెలిపారు.
- సూసైడ్ చేసుకునే వారు పైకిఎక్కే క్రమంలో తొందరగా స్పందించవచ్చన్నారు.
- ఎవరైనా అదృశ్యమైతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, ఈ సమాచారం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు
- కాగా సందర్శకులు కేబుల్‌బ్రిడ్జిపై నిలబడకుండా ఐటీ పెట్రోలింగ్ 24 గంటలు తిరుగుతూనే ఉంటుంది. అయిన ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఎత్తైన కంచెను ఏర్పాటు చేస్తే కొంతవరకు ఆత్మహత్యలను నివారించవచ్చని సీనియర్ సిటిజన్లు తెలిపారు.
- అనుమతులు లేకుండా డ్రోన్‌లు వాడకూడదన్నారు.
- లేక్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు జమీందర్‌లు, ఇద్దరు కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచారు. వీరితో పాటు ఒక ఎస్సై ఉంటారు.
- రిస్క్ చేసేందుకు ఒక స్పీడ్ బోటు ఉన్నాయి. చెరువు చుట్టూరా తిరిగేందుకు నాలుగు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి.
- చెరువులో పడ్డ వారిని ఏ విధంగా రక్షించాలో ఫైర్ సిబ్బంది శిక్షణ పొందారు
- పైనుంచి దూకిన వారిని, నీటిలో మునిగిపోతున్న వారిని ఏ విధంగా కాపాడాలో, బయటికి తీసుకువచ్చిన తరువాత ఎలాంటి ప్రథమ చికిత్స చేయాలో శిక్షణ ఇచ్చారు.
- మూడు పద్ధతులలో కాపాడనున్నట్టు తెలిపారు. డ్రైలాండ్ రిస్కు, సెమి కాంటాక్ట్, ఫుల్ కాంటాక్ట్ పద్ధతులను వాడాలని పోలీసులు తెలిపారు.
- బోట్ నడిపే విధానం, బోటు చెడిపోతే బాగు చేసుకునే పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.





చెరువులో దూకిన వారిని కాపాడే విధానంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ (ఫైల్)

సమస్యలకు చావు పరిష్కారం కాదు



ప్రతి ఒక్కరు ఏదో ఒక సమస్యతో బాధపడుతుంటారు. అలా అని చావు పరిష్కారం కాదు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో, బంధువులతో కలసి మాట్లాడి పరిష్కరించుకోవాలి. అధైర్యపడవద్దు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి సూసైడ్‌లు చేసుకోవద్దు. విలువైన కట్టడానికి అర్థం మారిపోతుంది. ఎవరైనా అదృశ్యమైనా, అనుమానాస్పదంగా ఉన్నా పోలీస్ స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేస్తే ఫోన్ ట్రేస్ చేసి లోకేషన్‌ని గుర్తించి ప్రాణాలను కాపాడవచ్చు.

–మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి

సామూహిక అక్షరాభ్యాసం



పెద్దషాపూర్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచు చంద్రశేఖర్

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచు చంద్రశేఖర్ సూచించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి తెలిపారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు తాగించాలన్నారు. ప్రతి గర్భిణీ, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నయోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వాతి, శ్రీదేవి, ప్రగతి, రజని, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పండుగ రోజున భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంను తరువాత అన్నదాన మహాప్రసాదం పంపిణీ చేస్తారు. గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అంజన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్, మహాలింగం గౌడ్, బైతి శ్రీధర్, నందకిషోర్, రాచూరి రాజశేఖర్, మెండే నగేష్, ఎస్.వెంకటేష్, కె.సుధాకర్, జి.బాబురావు, ఎన్.జగన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల గురించి తెలుసుకోవాలి

రాజేంద్రనగర్: సైబర్ నేరాల గురించి అందరూ తెలుసుకోవాలని రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రష్మీపెరుమాల్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ ఉమ్మకొండ కాలనీలోని టైనీ స్కాలర్స్ హైస్కూల్‌లో సైబరాబాద్ పోలీసుల సహకారంతో చిల్డ్రన్స్ సేఫ్టీ క్లబ్, సెల్ఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రష్మీపెరుమాల్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన టెక్నాలజీతో పాటు మోసాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకున్నాయన్నారు. సైబర్ నేరాలు భారీగా పెరుగుతున్నాయని ఈ నేరాలపై సరైన అవగాహన లేక చాలామంది బాధితులుగా మారుతున్నారన్నారు .సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డీసీపీ రష్మీపెరుమాల్

తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్ యశ్వంత్

రాజేంద్రనగర్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైలార్‌దేవ్‌పల్లి వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ హైస్కూల్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మైలార్‌దేవ్‌పల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ.యశ్వంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1–19 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని సూచించారు . కార్యక్రమంలో ఆదిత్య టాలెంట్ హైస్కూల్ డైరెక్టర్ పి.సూర్యనారాయణ, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కమ్యూనిటీ ఆర్గనైజర్ టి.చంద్రకళ, ఏఎన్ఎం శిరీషా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నర్కూడలో..

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ నీరటి తన్వీరాజు హాజరయ్యారు.

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ విద్యార్థులకు మందులు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, ఏఎన్ఎం సుజాత, సహారాబేగం, ఆశావర్కర్లు, బీజేపీ నాయకులు బీట్యాకరి సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమార్కుల బోర్డులు మాయం



అక్రమార్కులు ఏర్పాటు చేసిన బోర్డు (నిన్న)



నేడు ఇలా...

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్ : 'హెచ్ఎండీఏ భూముల్లో మళ్లీ ప్రైవేటు వ్యక్తుల పాగా 'శీర్షికన గురువారం 'సాక్షి 'దినపత్రికలో వచ్చిన కథనంతో అక్కడ పాతిన బోర్డులను తొలగించారు. పట్టణంలోని సర్వేనంబరు 720లో అక్రమార్కులు ఈ ఏడాది ఫిబ్రవరిలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుని భూ కబ్జాకు తెరలేపారు. అప్రమత్తమైన హెచ్ఎండీఏ ప్రత్యేక ఆపరేషన్ చేసి కబ్జాలో వెలిసిన ఇళ్లను తొలగించడంతో పాటు ఫెన్సింగ్ వేయించి కాపలా కాసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసింది. అయితే మరోమారు అక్రమార్కులు భూ కబ్జాకు సంబంధిత భూములు తమకు చెందినవిగా బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డులపై ఫోన్‌నంబర్లు కూడా రాశారు. సాక్షి కథనంతో బోర్డులు తొలగించారు.

ఉత్తరం చేరాలంటే కరెక్టు అడ్రస్ పిన్‌కోడ్ ఉపయోగించాలి

అత్తాపూర్: సరైన పిన్‌కోడ్‌ను ఉపయోగిస్తే ఉత్తరాల బట్వాడాలో ఎలాంటి జాప్యం ఉండదని హైదర్‌గూడ సబ్ పోస్టుమాస్టర్ బి.ఎస్.వీ.ఎస్.లక్ష్మి తెలిపారు. ఉత్తరం చేరే అడ్రస్‌లో సరైన పిన్‌కోడ్ లేని కారణంగా ఉత్తరాలు సరైన టైమ్‌లో చేరకపోవడం జరుగుతుందని ఆమె వివరించారు.

- సాయినగర్, హుడా కాలనీ, ఖయూంనగర్, ఎంఎంపహాడీ, సిక్‌చానీ, గురుద్వార్, నందిముస్లాయిగూడ, జలాల్‌బాబానగర్, భూపాల్‌రెడ్డినగర్, కిషన్‌బాగ్ ప్రాంతాల వాసులు 500064 పిన్‌కోడ్ నెంబర్‌గా ఉపయోగించాలన్నారు.
- సులేమాన్‌నగర్, పివి నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ 217 నుంచి 300 వరకు గృహ సముదాయాల ప్రజలు 500052 పిన్‌కోడ్ వాడాలన్నారు.
- బుద్వేల్, భవానీకాలనీ 500030,
- పి.వి.నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 117 నుంచి 216 వరకు ఉన్న ఉప్పర్‌పల్లి, నలందానగర్, పాండురంగానగర్, తేజస్వీనగర్, రాంబాగ్, మారుతీనగర్, వాసుదేవ రెడ్డినగర్, ఎర్రబోడ ప్రాంతాలవాసులు 500048 నంబర్‌లను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన

అత్తాపూర్: ప్రజల్లో ఓటుహక్కుపై అవగాహన పెంచేందుకుగాను 90 రోజుల పాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు హసన్‌నగర్ ఐస్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వీవీప్యాడ్ ద్వారా అవగాహన కల్పించారు. ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాలలో ఓటర్లుగా నమోదైన వారు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల పాటు రాజేంద్రనగర్ మండల, పట్టణ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, కుమార్‌యాదవ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



నార్సింగి ఏడవ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన వైస్ చైర్మన్ వెంకటేష్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో రూ. 30లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ కౌన్సిలర్ జి.అరుణజ్యోతితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బస్తీలు, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు పెద్దపీట వేశామన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వర్షాలకు ఇళ్లు కూలినవారిని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జావీద్ ఇల్లు కూలిపోవటంతో గురువారం ఆయన పరిశీలించారు.తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి

మణికొండ: హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉన్నత పాఠశాల ఆవరణలోని ఇంకుడు గుంతలను పునరుద్ధరింపచేశారు. ఈ కార్యక్రమాల్లో రిటైర్డ్ డీఎఫ్ఓ ఆజాద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు మాంగ్యానాయక్, నిరంజన్, ఎస్ఎస్‌డీపీఈ ఎన్‌జీఓ సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాయి, నాయకులు శ్రావణ్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన రామకృష్ణారెడ్డి తదితరులు

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

శంషాబాద్ రూరల్: రైతులకు రుణమాఫీ ప్రకటనతో గురువారం మండలంలోని చిన్నగోల్కొండ, మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శమని సొసైటీల చైర్మన్లు దినకర్‌గౌడ్, సతీష్ అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు మోహన్‌రావు, శివాజీ, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. సీఎం రైతులకు రుణమాఫీ చేయడంతో గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరెమైసమ్మ దేవాలయం చౌరస్తా వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా అభివర్ణించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోపాల్‌ముదిరాజ్, రాజిరెడ్డి, సయ్యద్ ఖాజా, రజాక్, సుందర్‌గౌడ్, మల్లేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



ఆరెమైసమ్మ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోనోకార్పస్ చెట్ల తొలగింపు

మణికొండ: పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారిన కోనోకార్పస్ మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్ గేటెడ్ కమ్యూనిటీ రోడ్‌లో ఉన్న మొక్కలను గురువారం తొలగించారు.

పన్నులు చెల్లిస్తేనే ప్రగతి

- మణికొండ మున్సిపల్ మేనేజర్ రమేష్

మణికొండ: ప్రతి ఒక్కరు మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నులను సకాలంలో చెల్లిస్తేనే అభివృద్ధి చేయగలుగుతామని మణికొండ మున్సిపల్ మేనేజర్ బీఆర్‌కే రమేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రపురి కాలనీలో ఇటీవల గృహాల కేటాయింపు, రిజిస్ట్రేషన్‌లు పూర్తి కావటంతో వారంతా వచ్చి చేరుతున్నారన్నారు. ఇంటి నెంబర్లను తీసుకుని ప్రతి సంవత్సరం పన్నులను చెల్లించాలన్నారు. అపుడే మీకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మున్సిపాలిటీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వసంతరావు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

బిల్లులు లేని సీసం కడ్డీలు పట్టివేత

శంషాబాద్: బిల్లులు లేకుండా సీసం కడ్డీలను తరలిస్తున్న లారీని ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. షాబాద్ మండలం నాగర్‌గూడ సమీపంలో అక్రమంగా తయారు చేసి హైదరాబాద్‌కు ఓ లారీలో తరలిస్తున్న 2500 కేజీల బరువున్న సీసం కడ్డీలకు సంబంధించిన ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరుకులు పంపిణీ

మణికొండ: గత వారం కురిసిన భారీ వర్షాలకు జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం, మోరంచపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడిన విషయాన్ని తెలుసుకుని గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల విద్యార్థులు వారికి అండగా నిలిచారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు గ్రామస్థులకు నిత్యావసరాలను అందించారు.

గండిపేట తహసీల్దార్‌గా గోవర్ధన్

మణికొండ: గండిపేట మండలానికి సుదీర్ఘకాలంగా తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.రాజశేఖర్ బుధవారం బదిలీ అయ్యారు. ఆయన జిల్లా యూఎల్‌సీ విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నుంచి గోవర్ధన్ బదిలీపై వచ్చారు. గురువారం పదవీబాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ సేవలను సకాలంలో అందిస్తామన్నారు.

శంషాబాద్ తహసీల్దార్ బదిలీ

శంషాబాద్: ఎన్నికల బదిలీల్లో భాగంగా శంషాబాద్ తహసీల్దార్ డి. శ్రీనివాస్‌రెడ్డి బదిలీఅయ్యారు. ఆయన రంగారెడ్డి జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగానికి బదిలీ చేశారు. శంషాబాద్ తహసీల్దార్‌గా ఇంకా ఎవరిని నియమించలేదు.

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE; RANGA REDDY DISTRICT AT L.B. NAGAR
I.A.NO. 1837 OF 2023
IN
A.S. No. 16 OF 2023

BETWEEN:
M/s. Raghuram Constructions (India) LLP. & others ...Petitioners/Appellants
AND
P. Vengal Rao died pers Lrs & others ...Respondents/ Respondents

To
1. Smt. Savitramma, W/o. A. Mallesh, R/o. Nacharam Village, Rajendra Nagar Revenue Mandal, R.R. District. ...Respondent No.8
2. Smt. Neelavati W/o. G. Yadagiri, R/o. Narsingi Village, Rajendranagar Revenue Mandal, R.R. Dist. ...Respondent No.9
3. Smt. Bhagyamma, W/o. Ch. Chander, R/o. Hydershan Kote, Rajendra Nagar Revenue Mandal, Ranga Reddy District. ...Respondent No.10

Take notice that the above application is filed against you and others under Order 41 Rule-5 and Section 151 C.P.C to grant stay of all further proceeding including implementation and execution or in any other manner under and in pursuance of the decree dated 21-06-2018 passed in O.S.No. 723 of 2003 on the file of I Additional Senior Civil Judge; Ranga Reddy District at L.B. Nagar, including execution of the decree in E.P. No.610 of 2019 is posted for your appearance on **21-08-2023** at 10:30 a.m. You are therefore hereby directed to enter appearance on the said date of hearing either in person or through your counsel duly instructed on the said date of hearing, failing which the matter would be heard and determined in accordance with law.

Issued under the orders of the Court on this the 02nd day of August, 2023 at Hyderabad.

Sd/- **G. ARUN**, Advocate
204 & 205, 4-1-969/7 & 470,
Second Floor, "Pushp" Ahuja Estate,
Abids, Hyderabad-500 001.

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE; RANGA REDDY DISTRICT AT L.B. NAGAR
A.S. No. 16 OF 2023

BETWEEN:
M/s. Raghuram Constructions (India) LLP. & others ...Appellants
AND
P. Vengal Rao died pers Lrs & others ...Respondents

To
1. Smt. Savitramma, W/o. A. Mallesh, R/o. Nacharam Village, Rajendra Nagar Revenue Mandal, R.R. District. ...Respondent No.8
2. Smt. Neelavati W/o. G. Yadagiri, R/o. Narsingi Village, Rajendranagar Revenue Mandal, R.R. Dist. ...Respondent No.9
3. Smt. Bhagyamma, W/o. Ch. Chander, R/o. Hydershan Kote, Rajendra Nagar Revenue Mandal, Ranga Reddy District. ...Respondent No.10

Take notice that agreived by the Judgment and Decree dated 21-06-2018 passed in O.S.No.723 of 2003 on the file of I Additional Senior Civil Judge; Ranga Reddy District at L.B. Nagar, the above appeal is filed by the Appellants/ Third Party against you and others is posted for your appearance on 21-08-2023 at 10:30 a.m. You are therefore hereby directed to enter appearance on the said date of hearing either in person or through your counsel duly instructed on the said date of hearing, failing which the matter would be heard and determined in accordance with law.

Issued under the orders of the Court on this the 02nd day of August, 2023 at Hyderabad.

Sd/- **G. ARUN**, Advocate
204 & 205, 4-1-969/7 & 470,
Second Floor, "Pushp" Ahuja Estate,
Abids, Hyderabad.